ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 13 నవంబరు 2024
www.prajaaswaramdaily.com
2 pm

## సీఎం అన్నను పంపిస్తారు..
# ఎంపీగా నేను వెళ్లకూడదా



**ఎంపీ డీకే అరుణను అడ్డుకున్న పోలీసులు**
**మన్నెగూడలో ఉద్రిక్తత**
**నా నియోజకవర్గంలో తిరగొద్దా? అని ప్రశ్నించిన ఎంపీ**

వికారాబాద్: మన్నెగూడ దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలోకి వెళ్లని వ్వకుండా ఎంపీ డీకే అరుణను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించిన నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై ఆగ్రహించారు. ఎంపీగా నా నియోజకవర్గంలో తిరగొద్దా అని ప్రశ్నించారు. నా నియోజకవర్గంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని చెప్పారు. నాకు కలెక్టర్ అపాయింట్‌మెంట్ ఉందని కూడా చెప్పారు. సీఎం వల్లే జిల్లాలో లా అండ్ ఆర్డర్ సమస్య వచ్చిందని విమ ర్శించారు. సీఎం అన్నను పంపిస్తారు..ఎంపీగా నేను వెళ్లకూడదా అని ఎంపీ డీకే అరుణ పోలీ సులను నిలదీశారు.

## సీఎం అప్రజాస్వామిక చర్యలపై
# పోరాటం



**బీఆర్ఎస్ కు ఆపాదించే కుట్ర**
**ప్రభుత్వాన్నిప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు**
**భయపెట్టాలని చూస్తే**
**అది మూర్ఖపు చర్యే**
**లగచర్ల రైతులను విడుదల చేయాలి**
**బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్**

హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టును బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రజలు చేసిన తిరుగుబాటును బీఆర్ఎస్ కు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలతో మాట్లాడినా నేతలను అదుపులోకి తీసుకుంటున్నారన్నారు. ప్రజా తిరుగుబాటు అణచివేతకు అప్రజా స్వామిక చర్యలకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు తప్పవని బెదిరిస్తు న్నారని దుయ్యబట్టారు. తమను భయపెట్టాలని చూస్తే అది మూర్ఖపు చర్యే అవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై పోరాటం కొనసాగు తుందని తెలిపారు. ఎంత అణ చివేసే ప్రయత్నం చేస్తే అంతగా పోరాటం చేస్తామన్నారు. లగ చర్లలో అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఏ1 సురేశ్

**46 మంది నిందితులు**
**16 మంది అరెస్టు**
**లగచర్ల దాడి ఘటన.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు**

వికారాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధి కారులపై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 16 మందిని అరెస్టు చేశారు. మొత్తం 46 మందిని నిందితులుగా గుర్తిం చినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో తెలిపారు. ఏ1గా భోగమోని సురేశ్‌ను చేర్చారు. ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ కోసం కలెక్టర్ సహా ఇతర అధికారులు వచ్చిన సమయంలో కొందరు కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారని చెప్పారు. అదనపు కలెక్టర్ లింగయ్య నాయక్, కడా అధికారి వెంకట్‌రెడ్డిపై హత్యాయత్నం చేశారని పేర్కొన్నారు.

**గ్రామంలోకి తీసుకెళ్లింది సురేశ్**

రాళ్ల దాడి కారణంగా కలెక్టర్, ఇతర అధి కారులు, పోలీసులకు సైతం గాయాల య్యాయని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. అభిప్రాయ సేకరణ కోసం ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ లింగయ్య, తాండూరు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఉమాశంకర్, తహసీల్దార్లు కిషన్ నాయక్, విజయ్‌కుమార్, కడా ప్రత్యేకాధికారి వెంక టరెడ్డి లగచర్లకు వచ్చారని పేర్కొన్నారు.



మొదట గ్రామ శివార్లలో గ్రామ సభ ఏర్పాటు చేశారని వివరించారు. అనంతరం సురేశ్ అనే వ్యక్తి కలెక్టర్ సహా ఇతర అధికారులను గ్రామంలోకి తీసుకువెళ్లాడని చెప్పారు. కలెక్టర్ వెళ్లిన సమయంలో అందరూ ఒకేసారి గుమిగూడారని.. ఆయన వాహనాన్ని అడ్డగించి నినాదాలు చేశారని తెలిపారు. కలెక్టర్ కారు దిగి వారి వద్దకు వెళ్లి మాట్లాడేందుకు ప్రయత్నం చేస్తుం డగానే.. దాడి చేసి వాహనాలపై రాళ్లు విసిరి ధ్వంసం చేశారన్నారు. ఘటనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో ఉపయోగించిన రాళ్లు, కర్రలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ నెల 11న లగచర్లలో జరిగిన ఘటనపై డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతోందని పేర్కొన్నారు

## కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్లి..
# అరెస్టు అంటారా?

**హైదరాబాద్**: వికారాబాద్ దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు మఫ్టీలో వచ్చి తీసుకెళ్లారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్తే దాన్ని అరెస్టు అంటారా..? అని ప్రశ్నించారు. నోటీసులు, కుటుంబానికి సమాచారం ఇవ్వకుండా తీసుకె ళ్లారని విమర్శించారు. "నరేందర్‌రెడ్డికి ప్రైవేటు సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించాలి. ప్రభుత్వ వైద్యులు, ప్రభుత్వ వ్యవస్థపై మాకు నమ్మకం లేదు. అరెస్టు చేసిన వారిని చిత్రహిం సలు పెట్టారని సమాచారం. కలెక్టర్ దాడి జరగ లేదన్నారు.. దాడి జరిగిందని ఐజీ చెబుతు న్నారు. వికారాబాద్ లగచర్ల ఘటన నిఘా వ్యవస్థ వైఫల్యమే. ఉద్దేశపూర్వకంగా అశాంతి రగిల్చి భూములు లాక్కునే యత్నమిది" అని కేటీఆర్ ఆరోపించారు.



## బంగారు వర్ణంలో నాగు పాము

**విశాఖపట్నం** : విశాఖపట్నంలోని యారాడ నేవీ ఉద్యోగుల క్వార్టర్స్ లో అరుదైన నాగు పాము కనిపించింది. ఈ పాము పడగ మొత్తం బంగారు వర్ణంలో కనిపిస్తోంది. పడగకు ముందు వెనుక మాత్రమే బంగారు వర్ణంలో, మిగతా భాగం మొత్తం సాధార ణంగా ఉండడం విశేషం. ఓ ఉద్యోగి కార్ షెడ్ లో కనిపించిందీ పాము. కారు బయటకు తీస్తున్న సమయంలో ఈ పామును చూసిన సదరు ఉద్యోగి స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ లో సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న నాగరాజు ఈ పామును బంధించారు.

# ఇది రాజకీయ కక్షే



**పచ్చని పొలాల్లో చిచ్చు పెట్టడమే ప్రజాపాలనా?**
**మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్ : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకో వడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పాలన గాలికి వదిలి అక్రమ కేసులతో రాజకీయ కక్ష తీర్చు కోవడం సిగ్గుచేటని విమర్శించారు. పచ్చని పొలాల్లో ఫార్మాసిటీ పేరిట చిచ్చు పెట్టడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులతో అణచివే యలేరన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని మాజీ మంత్రి పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టు

**దుద్యాల** : వికారాబాద్ జిల్లా కలెక్టర్ మీద జరిగిన దాడి ఘటనలో నరేందర్ రెడ్డి ప్రమేయం ఉందని పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. లగచర్లలో కలెక్టర్ మీద జరిగిన దాడిని బీఆర్ఎస్‌కు ఆపాదించే కుట్రలో భాగంగానే తనను అరెస్ట్ చేశారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు.తన అరెస్ట్‌పై ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి అప్రజాస్వా మిక చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగు తుందన్నారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతుల తిరుగుబాటుతో సీఎం కంగుతిన్నారన్నారు. ఆ డ్యామేజీని కంట్రోల్



చేసుకోవడానికే లగచర్లలో జరిగిన ఘటనను బీఆర్ఎస్‌కు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 42 సార్లు సురేశ్‌తో మాట్లాడారు

**ఫోన్ రికార్డు ఉంది**
**మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్య**

**నల్లగొండ**: లగచర్ల ఘటన సమయంలో నిందితుడు సురేశ్‌తో మాజీ ఎమ్మెల్యే ఒకరు 42 సార్లు మాట్లాడినట్లుగా తెలిసిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడినట్లు కూడా ఫోన్ రికార్డింగ్ ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన వెనుక ఎంత పెద్దవాళ్లు ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. నల్గొండ జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ... దాడులకు దిగిన వారికి మద్దతిస్తామని బీఆర్ఎస్ చెప్పడం



విడ్డూరంగా ఉందన్నారు.

# ఆర్‌జీవీకి నోటీసులు

హైదరాబాద్ : టాలీవుడ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మకు ఒంగోలు పోలీసులు హైద రాబాద్‌లోని వర్మ నివాసానికి చేరుకుని



నోటీసులు అందజేశారు. ఈ నెల 19న మద్దిపాడు పీఎస్‌కు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వ్యూహం సినిమా సమయంలో టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, నారా బ్రాహ్మణిలను కించపరిచేలా రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకుగాను మద్దిపాడు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మద్దిపాడు పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు.

## అన్యాయం అంతరిస్తే
# నా గొడవకు ముక్తిప్రాప్తి...

**కాళోజికి సీఎం రేవంత్ నివాళి**

హైదరాబాద్ : 'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి... అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడ'ని ప్రకటించిన ప్రజా కవి కాళోజి నారాయణరావు గారు నిత్య స్మరణీయులని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కొనియాడారు. కాళోజి నారాయణరావు గారి వర్ధంతిని పురస్కరిం



చుకొని ఢిల్లీలోని అధికారిక నివాసంలో కాళోజి గారి చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు.

# నివాసాలు కూల్చబోం

**బతుకమ్మకుంటలో ఇకపై కూల్చివేతలు ఉండవు**
**హైడ్రా కమిషనర్ రంగనాథ్**
**అంబర్ పేటలో పర్యటన**

**హైదరాబాద్** : బతుకమ్మ కుంటలో ఇకపై కూల్చివే తలు చేపట్టబోమని హైడ్రా చీఫ్ రంగనాథ్ పేర్కొన్నారు. బుధవారం అంబర్ పేటలో ఆయన పర్యటించారు. బతుకమ్మ కుంటను సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. హైడ్రాపై అపోహలు, ఆందోళనలు అక్కర్లేదని హామీ ఇచ్చారు. ఆక్రమించిన స్థలంలో ఉన్న నివాసాలను కూల్చబోమని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. స్థానికులతో బతుకమ్మ కుంట పునరు ద్ధరణపై ఆయన చర్చించారు. 1962 నాటి రికార్డుల ప్రకారం బతుకమ్మ కుంట 16.13 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని, కాలక్రమంలో ఆక్రమణలకు గురై ప్రస్తుతం 5.15 ఎకరాలు మిగిలిందని చెప్పారు.

**ఆ ప్రచారం వట్టిదే..**

ఈ విషయంలో స్థానికులు విజ్ఞప్తి చేయడంతో బతుకమ్మ కుంట ఆక్రమణల తొలగింపు, పునరుద్ధరణ చర్యలు చేపట్టామని హైడ్రా చీఫ్ పేర్కొన్నారు. అయితే, ఆక్రమించిన స్థలంలో ఉన్నప్పటికీ నివాస సముదాయాల జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరోవైపు హైడ్రాపై జరుగుతున్న అసత్య ప్రచారంపైనా రంగనాథ్ స్పందించారు. హైడ్రా ఎఫెక్టుతో నగరంలో రిజిస్ట్రేషన్లు పడిపో యాయని జరుగుతున్న ప్రచారం అంతా వట్టిదేనని కొట్టిపారేశారు. రిజిస్ట్రేషన్లు పెరిగాయని చెప్పడానికి లెక్కలు కూడా ఉన్నాయని వివరించారు.

